క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. 16వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పారు. ప్రతిరోజూ డ్రెయిన్స్ శుభ్రం చేసేలా, మురుగునిల్వ ఉండకుండా చూసేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, కిషోర్ తదితరులు ఉన్నారు.

మొగల్తూరులో క్షుద్రపూజల కలకలం



రహదారి కూడలిలో క్షుద్రపూజల ఆనవాళ్లు

నరసాపురం రూరల్: మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మొగల్తూరు పంచాయతీ పరిధిలో ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడలి రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు నిమ్మకాయలు, కోడిగుడ్డు, మసిబొగ్గు, ఎండుమిర్చి, పసుపు, కుంకుమ, అన్నంముద్దలు రోడ్డుపై వేశారు. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం స్కూల్‌కువెళ్లే చిన్నారులు, మార్కెట్‌కు వెళ్లే ప్రజలు ఒక్కసారిగా భయపడ్డారు. మొగల్తూరు జాతీయరహదారిపై గతంలోనూ క్షుద్రపూజలు చేసిన దుండగులు కొంతకాలం తరువాత మళ్లీ పూజలు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

డాక్టర్ బాలచందర్‌కు మానవత సత్కారం



పెనుగొండ మానవత ఆధ్వర్యంలో డాక్టర్ బాలచందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రముఖ అస్కా ఛైర్మన్, మానవత పూర్వ అధ్యక్షుడు, అడ్వయిజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ బాలచందర్ సాదేను మానవత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రీజనల్ సమావేశంలో డాక్టర్ బాలచందర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, సెంట్రల్ కమిటీ ఛైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, విస్తరణ అభివృద్ధి కమిటీ కన్వీనరు డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి, శాంతిర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అభినయ సోదరీమణులు గ్రంథావిష్కరణ

పెనుగొండ: ప్రముఖ నటులు షావుకారు జానకీ, కృష్ణకుమారిలపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ రచించిన అభినయ సోదరీమణులు గ్రంథాన్ని షావుకారు జానకి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ మేరకు వైట్లకిషోర్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ చెన్నైలో షావుకారు జానకి నివాసంలో నిర్వహించినట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ తమిళ నటుడు శంకర్‌కృష్ణమూర్తి, షావుకారు జానకి కుమార్తె యజ్ఞప్రభ, కుమారుడు వెంకట రమణ పాల్గొన్నారు.

జీతాలివ్వాలని 104 ఉద్యోగుల వినతి



డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.స్వరూప్‌కి వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

పాలకొల్లు అర్బన్: 104 ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ బుధవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.స్వరూప్, మెడికల్ ఆఫీసర్ డా.సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. 104 సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. జీవో నెం.7 ద్వారా జీతాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్ డబ్బులు తిరిగి చెల్లించాలని, సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు యాజమాన్యం ద్వారా రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఉద్యానానికి ఉపాధి ఊతం

రైతులను ఆదుకుంటున్న ఉపాధి హామీ సొమ్ము

మొగల్తూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తోటల పెంపకానికి ఆర్థిక సహాయం అందిస్తుంది. రైతులతో తోటల సాగు చేయించడంతో పాటు రైతులకు నిర్వహణా ఖర్చులను భరిస్తుంది. దీనిలో భాగంగానే మొగల్తూరు మండలంలో సుమారు 120 ఎకరాల్లో మామిడి, కొబ్బరి తోటల పెంపకం చేపట్టారు. రానున్న రోజుల్లో తోటల పెంపకం పెంచేందుకు కృషి చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. 2006–07లో ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు.

రైతుల ఉత్సాహం

గత రెండు,మూడేళ్ళుగా తోటల పెంపకంపై రైతులు మక్కువ చూపుతున్నారు. మొగల్తూరు మండలంలో నీటి వసతి పూర్తిస్థాయిలో ఉండడంతో మామిడి, కొబ్బరి, సరుగుడు తోటలు ఎక్కువగా ఉంటాయి. అయితే నేల స్వభావాన్ని బట్టి ఉపాధి హామీ పథకంలో కొబ్బరి, మామిడి, జామ, మునగ, సపోటా, దానిమ్మ తోటల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం మొగల్తూరు మండలంలో కొబ్బరి 67 ఎకరాలు, మామిడి 63 ఎకరాల్లోనూ పెంచేందుకు రైతులు కృషి చేస్తున్నారు. వీటితో పాటు మునగ, దానిమ్మ, సపోటా, జామ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, ఎకరా నుంచి అయిదు ఎకరాలు వరకు తోటల పెంపకం చేపట్టవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.



పేరుపాలెంలో ఉపాధి హామీ పథకంలో పెంచుతున్న మామిడి తోట

మట్టి పరీక్షలు ద్వారా తోటల ఎంపిక

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ ఆర్థిక సహాయంతో రైతులకు లబ్ధి చేకూరుతుంది. అయితే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లు మట్టి పరీక్షలు చేయించిన అనంతరం ఏ రకం తోటలు పెంచాలనేది నిర్ణయిస్తారు. మొగల్తూరు మండలంలో నేల స్వభావాన్ని బట్టి ఇప్పటికే మామిడి, కొబ్బరి, సపోటా, జామ తోటలున్నాయి. ఇసుక, మట్టి, చౌడు భూములు కూడా ఎక్కువగా ఉండడంతో సీతాఫలం, నీరు నిలవని నేలలు ఎక్కువగా ఉండటంతో మునగ, అన్ని రకాల నేలల్లోనూ దానిమ్మ కాయలను కూడా పెంచవచ్చునే ఉద్దేశ్యంతో దానిమ్మ పండ్ల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి తోటల పెంపకం ఎక్కువగా చేపట్టేందుకు కృషి చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో సాగు చేసిన తోటలకు మూడేళ్ల పాటు పని దినాలను బట్టి నిర్వహణా నిధులను విడుదల చేయడంతో రైతులు ఉత్సాహంగా ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకుంటున్నారు.



కేపీ పాలెం సౌత్‌లో కొబ్బరి మొక్కలు నాటుతున్న రైతు

లబ్ధి ఇలా

రకం	ఎకరాకు మొక్కలు	అందించే లబ్ధి
మామిడి	70	రూ.1,02,756
కొబ్బరి	60	రూ.88,821
మునగ	448	రూ.1,01,541
జామ	110	రూ.1,41,784
సపోటా	60	రూ.88,255
దానిమ్మ	267	రూ.2,48,845

టెండర్ల విధానం రద్దు చేయాలి

పెనుగొండ: పంచాయతీల్లో టెండర్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయుడు డిమాండ్ చేశారు. బుధవారం పెనుగొండ పంచాయతీ వద్ద కార్మికులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో టెండర్ విధానంలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం అక్రమార్కులపై చర్యలుతీసుకోవాలన్నారు. పంచాయతీ కార్మికులను కార్మికులుగా గుర్తించి వారికి పీఎఫ్ ఈఎస్ఐలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పెనుగొండ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు, కార్మికులు బంగారు విజయ పాల్గొన్నారు.

సంతోషానికి దోహదం చేసే సూత్రాలపై అవగాహన

నరసాపురం: జీవితంలో మనం సాధించే విజయాలు, సంతోషాలు మనచేతిలోనే ఉంటాయని బెంగుళూరుకు చెందిన ఎస్ స్మైల్స్ సంస్థ సీఈవో తేజూ అన్నారు. బుధవారం వైఎన్ కళాశాలలో ఐక్యూఏసీ సెంటర్ ఆధ్వర్యంలో సంతోషానికి దోహదం చేసే మూల సూత్రాలు మన పాత్ర అనే అంశంపై రెండురోజుల వర్క్ షాపును ఏర్పాటు చేశారు. మొదటిరోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తేజూ మాట్లాడుతూ మనం ఆనందంగా ఉండాలంటే మన లక్ష్యాలు భారీగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎన్.చింతారావు పాల్గొన్నారు.

వెలుగు వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నరసాపురం: వెలుగుశాఖలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వీఓఏలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ బుధవారం సీఐటీయూ, ఏపీ వెలుగు వీఓఏల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వీఓఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని ఎన్నికల్లో కూటమినేతలు హామీలు ఇచ్చారని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఊసే ఎత్తడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఓఏల తొలగింపును ఆపాలన్నారు. తొలగిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని, అలాగే మహిళా మార్టల్లో నిర్బంధ కొనుగోళ్లను ఆపాలని డిమాండ్ చేశారు. వెలుగు ఏపీఎం జక్కంపూడి నాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీవోఏలు కె.దుర్గ, జి.స్వాతి, ఎం.స్వర్ణలత, ఎం.బాలా త్రిపురసుందరి, పి.పద్మావతి పాల్గొన్నారు.



నరసాపురం: వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

పెనుగొండలో..

పెనుగొండ: వీఓఏల వేతన బకాయిలు చెల్లించి, అక్రమంగా తొలగించినవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వీఓఏ మండల కార్యదర్శి చెన్నం అనురాధ డిమాండ్‌చేశారు. బుధవారం వెలుగు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించి ఏపీఎం పుష్పకి వినతి పత్రం సమర్పించారు. వీఓఏల ఉపాధిని దెబ్బతీసే మూడుసంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. ఆంజనేయులు, సైపు శేషారత్నం లక్ష్మీకుమారి, జి.లక్ష్మి పాల్గొన్నారు.



పెనుగొండ: వినతి పత్రం సమర్పిస్తున్న వీఓఏలు

మహిళలు ఆర్థికంగా బలపడాలి

పెనుగొండ: మహిళలు ఆర్థికంగా బలపడిన నాడు కుటుంబంతో పాటు, దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని కరూర్ వైశ్యాబ్యాంక్ తణుకు బ్రాంచి మేనేజరు వీఎస్ చైతన్య అన్నారు. మై పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కరూర్ వైశ్యా బ్యాంక్ ఆర్థిక సౌజన్యంతో ఆరు నెలలు పాటు శిక్షణ పొందిన 100 మహిళలకు పెనుగొండలో కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. మై పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మాదిరెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలన్నారు. స్వయంశక్తితో శక్తివంతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాదిరెడ్డి వెంకట త్రినాథ్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ కొమ్ముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండలో కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాస్టర్లను వేధిస్తున్న ప్రభుత్వాల నిర్ణయాలు

పాలకొల్లు అర్బన్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు పాస్టర్లను, క్రైస్తవ మతం స్వీకరించిన విశ్వాసులను ఆందోళనకు గురి చేసే విధంగా ఉన్నాయని, వీటిని సంఘటితంగా ఎదుర్కొవడానికి పాస్టర్లు, విశ్వాసులు ఐక్యం కావాలని పాస్టర్ యతిరాజు రూబేను పిలుపు నిచ్చారు. పాలకొల్లు పట్టణంలో హౌస్ ఆఫ్ ప్రేయర్ సంఘ కాపరి నాళం గుప్త చర్చి ఆవరణలో బుధవారం నిర్వహించిన పట్టణ, మండల పాస్టర్ ఫెలోషిప్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం తక్షణం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మత స్వేచ్ఛను ప్రభుత్వాలు హరిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ త్వరలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.



కత్తుల సత్యనారాయణను అభినందిస్తున్న పాస్టర్లు

ఈ నెల 12న నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకి వేలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. పాస్టర్ల సంఘ లీగల్ అడ్వయిజర్లుగా కత్తుల సత్యనారాయణ, రావి దేవరాజులను ప్రకటించారు. సంఘ అధ్యక్షుడు యేసు కృపా శ్యాంసన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడు ఐ సెయింట్‌పాల్, పాస్టర్ ఎం.శ్రీనివాసరావు, కన్వీనర్ మట్టా జాన్ మోషే, కార్యదర్శి బొక్కా ఇశ్రాయేలు, నాళం పద్మ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి బాల వీరభద్రస్వామి ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో బాలవీరభద్రస్వామి

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు పల్లపువీధి (కర్ణాలదొడ్డి)లో వేంచేసియున్న శ్రీ బాలవీరభద్రస్వామి ఉత్సవాలను ఈ నెల 17 నుంచి నిర్వహించడానికి ఉత్సవ కమిటీ తీర్మానించింది. సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, మండల పరిషత్ ప్రతిపక్షనేత శాగ సత్యనారాయణ, గ్రామ పెద్దలు సమక్షంలో బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పాతగుడిని జీర్ణోద్ధరణ చేయాలని, అలాగే పాతగుడిలోని విగ్రహానికి వేదపండితుల సూచనలు, సలహాల మేరకు ఈ నెల 20న కొత్తగుడిలో ప్రతిష్టించడానికి నిర్ణయించారు. అలాగే కొత్త గుడి స్థలదాత కాసా శివయ్య చిన్నకుమారుడు కాసా కోటి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించాలని తీర్మానించారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

యలమంచిలి: మండలంలోని గుంపర్రు గ్రామంలోని శ్రీ సర్వమంగళ పార్వతీ సమేత గోకర్ణేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన (లక్ష పత్రి పూజ) నిర్వహించారు. ఆలయ అర్చకులు మానేపల్లి నీలకంఠేశ్వరరావు ఆధ్వర్యంలో శైవగామ పండితులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెనికేరుకు చెందిన బ్రహ్మశ్రీ కాళ్లకూరి చంద్రమౌళి శర్మ, ములపర్రుకు చెందిన బ్రహ్మశ్రీ దొంతుకుర్తి సత్యనారాయణశర్మ బ్రహ్మత్వంలో లక్ష పత్రి పూజ జరిగింది. పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదిక్షణ, భక్త దంపతులతో గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకము, శిఖరాగ్ర కుంభాభిషేకము, సూర్యనమస్కారములు, లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, లక్ష్మీగణపతి రుద్ర దుర్గాసూక్త నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మహాలింగార్చన, జ్యోతి లింగార్చన, శాంతికళ్యాణము, నీరాజన మంత్ర పుష్పాలు, మహదాశీర్వదము, వేదస్వస్తి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. గ్రామస్తుల ఆర్థిక సహకారంతో జరిగిన ఈ పూజా కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్ములూరి లోకేశ్వరరావు పర్యవేక్షించారు.



గుంపర్రు శివాలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నామినేటెడ్ పదవుల్లో దేవాంగ చేనేత వర్గానికి అన్యాయం

పెనుమంట్ర: రాష్ట్రంలో చేనేత జనాభాలో 16 లక్షల జనాభా ఉన్న దేవాంగ చేనేత వర్గానికి నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి రొబ్బి భాస్కరరావు అన్నారు. బుధవారం మార్టేరు దేవాంగుల కమ్యూనిటీ హాలు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లో దేవాంగ చేనేత వర్గానికి సముచిత స్థానం కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ కులాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తమకులానికి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, ప్రత్యేక దేవాలయాలలో బోర్డు సభ్యులుగా నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవించారని, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం తమ కులాన్ని గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జాతీయ చేతి వృత్తుల జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్యభాస్కరరావు, దేవాంగ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ బల్ల మాసరయ్య పాల్గొన్నారు.



మార్టేరులో మాట్లాడుతున్న జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి రొబ్బి భాస్కరరావు

హెర్నియా చికిత్సపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: పెరుగుతున్న టెక్నాలజీతో వైద్య విధానంలో సులభమైన చికిత్సలు చేయవచ్చని డాక్టర్ జి.శ్యామ్ వివేక్ అన్నారు. స్థానిక వివేక్ నర్సింగ్ హోమ్‌లో ప్రజలకు అడ్వాన్స్ లాప్రోస్కోపిక్ ద్వారా హెర్నియా ఆపరేషన్ ఎంత శులభమైన పద్ధతిలో చేయవచ్చనే విషయాలని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ ప్రజల్లో హెర్నియా ఆపరేషన్ అంటే ఓపెన్ సర్జరి అనే ఆలోచనలోనే ఉన్నారన్నారు. అడ్వాన్స్ లాప్రోస్కోపిక్ ద్వారా ఇప్పటికి తమ ఆసుపత్రిలో సుమారు 50 ఆపరేషన్లు చేశామని అన్నారు. ఈ ఆపరేషన్‌పై పూర్తి వివరాల కోసం 79012 20777 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

పాలకొల్లు సెంట్రల్: దేశంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అలాగే ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ వన్ అండ్ టు కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ, నెహ్రూ యువజన కేంద్రం ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణం పరిరక్షణ , మొక్కలు నాటడంపై వ్యాసరచన, అలాగే యాంటీ డ్రగ్స్ అవగాహనపై పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు యువజన కేంద్రం వలంటీర్ కె.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ, కళాశాల డ్రగ్ కమిటీ కన్వీనర్ ఎ.వంశీ సుబ్బరాయన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

నరసాపురం రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెవెన్త్‌డే ఎడ్వంటిస్ట్ స్కూల్ హాస్టల్ నుంచి మంగళవారం ఉదయం ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. అయితే బుధవారం వారి ఆచూకీ తెలిసింది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు టీచర్లు బెదించారని, కొడుతున్నారని, హాస్టల్ వాతావరణం నచ్చడం లేదని విద్యార్థులు చెబుతున్నప్పటికీ బయట ఇద్దరు బాలికల అదృశ్యంపై చర్చ జరుగుతోంది. విద్యార్థులు మాయమైన సంగతి మంగళవారం రాత్రి బయట పడటంతో ఒక్కసారిగా సెవెన్త్‌డే యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఆందోళనకు గురయ్యారు. స్కూల్ పరువు పోతుందని విషయం బయటకు పొక్కకుండా యోచన చేసినప్పటికీ విషయం బయటకు పొక్కడంతో మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అప్రమత్తమై విద్యార్థినులు ఇద్దరూ ఎల్బీచర్లలో ఉంటున్న ఓ విద్యార్థిని ఇంటికి వెళ్లే క్రమంలో పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకెళ్లి ఆరా తీశారు. విద్యార్థినులను మండల తహసీల్దార్ ఎదుట హాజరుపరచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మార్కెటింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్

నరసాపురం రూరల్: ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు మార్కెటింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చైన్నైకు చెందిన ఎల్‌టెక్ అప్లెయిన్స్ వైస్ ప్రెసిడెంట్ బండి సురేష్‌కుమార్ అన్నారు. నరసాపురం మండలం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ రీ– పెంటో ట్రెండ్స్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాపు నిర్వహించారు. మార్కెటింగ్ రంగాల్లో ఉద్యోగావకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎ.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ–దేవ రహదారి పనులు పునః ప్రారంభమెప్పుడో?

పెనుగొండ: పెనుగొండ దేవ రహదారి విస్తరణ పనులు పునః ప్రారంభమెపుడోనంటూ ఎదురు చూపులు చూస్తున్నారు. దశాబ్ద కాలంగా పెనుగొండ దేవ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రహదారి జెడ్పీలో ఉండడంతో నిధులు కొరత వెంటాడుతుండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జెడ్పీ నుంచి ఆర్‌అండ్‌బీకి 7.7 కిలోమీటర్ల మేర పెనుగొండ దేవ రహదారిని బదిలీ చేశారు. అయితే నిధులు మంజూరులో జాప్యం జరగడంతో రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో పెనుగొండ దేవ, ఆచంట సిద్ధాంతం రహదారి విస్తరణకు రూ.15 కోట్లు నిధులు మంజూరు కావడంతో గత ఏడాది విస్తరణ పనులు ప్రారంభించారు. రహదారిలో పెనుగొండ, సోమరాజు చెరువు, దేవల వద్ద గ్రామాల మధ్యలో సీసీ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. సీసీ రహదారులను కలుపుతూ విస్తరణ పనులు పూర్తిచేసి, బేస్ రహదారి నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గత కొంత కాలంగా తుది దశ బీటీ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల ముందు నుంచి రహదారి నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోవడంతో తిరిగి పునః ప్రారంభం కాలేదు. దీంతో ఆచంట–సిద్ధాంతం, పెనుగొండ–దేవ రహదారుల్లో ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా మారింది.



మధ్యలోనే నిలిచిన పెనుగొండ-దేవ విస్తరణ పనులు

దుమ్ముతో అవస్థలు

ఆచంట సిద్ధాంతం గోతులమయంగా మారి ప్రయాణం చేయడం కష్టసాధ్యంగా మారడంతో వాహనదారుల ఇక్కట్లు వర్ణనాతీతం. పెనుగొండ దేవ రహదారిలో విస్తరణపనులు జరిగి బీటీ నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనం వెళుతుంటే విపరీతంగా దుమ్ము లేచి వెనుక ఉన్నవారు నానావస్థలకు గురవుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది పెనుగొండలోని ఆసుపత్రులకు, కళాశాలలకు, ఇతర అవసరాలకు ప్రయాణం చేస్తుంటారు. రహదారి ప్రయాణం ఇబ్బందికరంగా మారడంతో ఆందోళనకు గురవుతున్నారు. అధికారుల, ప్రజా ప్రతినిధులుస్పందించి రహదారి నిర్మాణ పనులు పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు సత్వరం ప్రారంభించాలి



పెనుగొండ దేవ రహదారి నిర్మాణ పనులు సత్వరం ప్రారంభించాలి. సీసీ రహదారుల నిర్మాణాలు పూర్తి కావడంతో కేవలం తారు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఐదు నెలలుగా నిర్మాణ పనులు జరగడం లేదు. గత ప్రభుత్వంలో 60 శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి.

– దంపనబోయిన బాబూరావు, సోమరాజు చెరువు

